గెరిల్లా గోవిందు

అవాళ 22 మార్చి 48 తారీకుని సూచిస్తూ కాలెండర్, గోడమీద వూగులాడుతోంది. నిజాం సరిహద్దు దగ్గిర కొత్తగా మకాం వేసిన రజాకార్లు సిగరెట్లు తగలేస్తో, మధ్య మధ్య సారా సేవిస్తూ, గది మధ్య బల్లచుట్టూ కూర్చున్నారు. గది నాల్గుగోడలకీ, బ్రెన్ గన్నులూ, తుపాకులూ వేళ్లాడుతూ వాతావరణాన్ని భయపెడ్తున్నై! అప్పుడే చీకటిపడుతూంది. గది వాకిలిగుండా బావురుమనే విశాలమైదానమూ, దూరంగా నల్లగుట్టల్లాగు కన్పించే పూరిళ్ళూ మసక మసకగా అవుపిస్తున్నై. ఆ ప్రాంతమంతా, రజాకార్లదుష్కృత్యాల భయంతో ఏశ్వాస పీల్చి వొదులుతున్నట్లు గాలి వెచ్చగా విసుగూ వీస్తోంది. బల్లచుట్టూ కూర్చున్న ఎనిమిది మందిలోనూ భయానకమైన మొరటు గొంతుతో, ఎర్రబడ్డ కళ్ళు మిటకరిస్తో ఒకడు ప్రారంభించాడు సంభాషణ. వాడి విగ్రహమే చెబుతోంది. వాడు నరమాంసాహారి అని. అతను బల్లమీది సారాగ్లాసు చేతిలోకితీసుకుంటూ '' ఆ కాఫిర్ బేవకూఫ్ దొరికితేనా: నిలువునా చంపేస్తాను...'' అన్నాడు గొంగ్రించి.

పొట్టిగా, కుదేసిన బస్తాలా, మంచి రక్తవర్ణం తేలిన మరొకడు, ''నేనే వాణ్ణిచూస్తే!'' అని సిగిరెట్ అంటించడంలో లీనమైనాడు.

మొదట గొంగ్రించిన వాడిపేరు రహిమాన్, అతను తనలోపలే ఏదో ఆలోచిస్తోపైకి చిరునవ్వు నవ్వి మిగతా వాళ్ళవంక ధీరంగాచూస్తూ ''వాడు ఈ చుట్టుపక్కలే తిరుగుతున్నాడుభాయీ, దొరికిపోతాడులే, రెండు రోజులకిందట నారాయ్‌పాలెంలో కన్పించాడని ఎవడో కాఫిర్ అన్నాడు. అంటూ ఒకగుక్క సారాయి తాగాడు తాహీగా.

మిగతా ఏడుగురు హంతకులూ, రహిమాన్‌వంక భయంతోనూ' సందేహంగానూ చూసారు. వాళ్ళకి ఎంత సారాతాగినా, భయం వదలడం లేదు నిషా ఎక్కడం లేదు.

పొట్టివాడి పేరు అబ్దుల్, అతను రహమాన్‌ని కళ్ళార్పకుండా ఒక నిముషం చూసి, ''అయితే వాడు ఇక్కడే వున్నాడని అర్థం? ఏం భాయి చెప్పు! వాడి పేరేమిటి? మరిచిపోయినానులే....'' అని అడిగాడు, అతడు భయపడుతున్నాడో, లేక ఆసక్తే కనపరుస్తున్నాడో, అతని స్వరం వల్ల బోధపడటం లేదు.

రహిమాన్ భీకరంగా నవ్వాడు. గదిలో కాలెండర్ వూగులాడింది. చీకటి వొణికింది. మీరు భయపడుతున్నారా? అన్నట్టు చూసాడు అందర్నీ. తర్వాత బల్లమీద మోచెయ్యి ఆన్చి, అరచేతిలో

గడ్డం పెట్టుకుని, మెల్లగా రహస్యం చెప్పేవాడిలా, ఇలా అన్నాడు, ''వాడి పేరు గోవిందు చాలా అల్లరిరకం అంట, వాణ్ణి పట్టుకోకపోతే భలే నామర్దా మనకి!'' అతని ముఖంలో నిశ్చితాభిప్రాయాన్ని వెలిబుచ్చే ముడతలు కలిగినయి.

అతని సహచరుల మొహాలు ఎందుకోగాని ఎర్రబారినై, వాళ్ళిది వరకే ఆ పేరు విన్నట్టు కనిపించారు. ఒకరి మొహాలు ఒకరు తీవ్రంగా పదినిముషాలు చూసుకున్నారు, మౌనంగా! గాలికూడా వాళ్ళ మౌనాన్ని భంగం చేయడమెందుకా అన్నట్లు ఒక నిముషం ఆగింది. రహిమాన్ చేతిలో సారాగ్లాసు జారి బల్లమీదపడి మౌనం భంగమైంది.

ఆ మసక చీకటి ఉలిక్కిపడ్డది. అబ్దుల్ గూడా ఉలిక్కి పడ్డట్టే అగుపించాడు ''అరేభాయీ, దీపం వెలిగించనా?'' అని మిగతా వాళ్ళని ప్రశ్నించి, వాళ్ళ జవాబు రాకముందే అతను ఆ పనిలో నిమగ్నమైనాడు.

రహిమాన్ అబ్దుల్ వైపు తూలేకళ్ళతో వురిమిచూస్తూ, ''అరే మన కొత్త సర్దార్ ఈ పాటికే వస్తూవుండాలిగా'' అని అడిగాడు. అక్కడి వాతావరణాన్ని ఆవరించిన భయాన్ని పోగొట్టాలనే ప్రయత్నం అతని గొంతులో స్ఫురిస్తున్నది. అబ్దుల్ వెలిగించిన లాంతర్ కొంత భయాన్ని చీకటిని పారద్రోల గలిగింది. అబ్దుల్ లాంతరును బల్లమధ్యపెట్టి తన కుర్చీలో కూలబడుతూ ''నిజమే, ఈ పాటికి రావల్సింది'' అని సమాధానమిచ్చాడు. అబ్దుల్‌కి ఎడంవైపున కూర్చున్న ముప్పై ఏళ్ళ మరొకడు తన ముఖంమీద ముడతల్ని ఎక్కువచేస్తూ అబ్దుల్‌వైపు అప్రయత్నంగా తిరిగి, ''సర్దార్ రావటంతో మనం గోవిందుకోసం పోవాలా?'' అని ప్రశ్నించినట్టు ఆశ్చర్యపడ్డాడు. అబ్దుల్ సారా గ్లాసులోనికి కూజాలోంచి సారాని పోసుకుంటూ ''అవును హుస్సేన్ భాయీ! అదే మనప్లాను!'' అని రహిమాన్‌వైపు తిరిగి ''క్యాజీ! అంతేనా?'' అని ప్రశ్నించాడు. రహిమాన్ మాట్లాడకుండా ఆమోద సూచకంగా తలూపాడు.

హుస్సేన్ ఒక్కగుక్కన తనచేతిలో సారాగ్లాసు సగంపై చిల్లర ఖాళీచేసి, ''వాడెట్లా వుంటాడు? మనం గుర్తుపట్టక్కరలేదూ?'' అని రహిమాన్‌వైపు చూస్తూ ప్రశ్నించాడు. మిగతా హంతకులు గూడా, ఈ ప్రశ్నకు రాబొయ్యే సమాధానాన్ని ఆకాంక్షిస్తున్నట్టు, రహిమాన్‌వైపు హుషారుగా చూడసాగారు.

రహిమాన్ వాకిలివైపు, రాబొయ్యే కొత్తసర్దారు కోసం గావును ఆదుర్దాగా చూస్తున్నాడు. హుస్సేను ప్రశ్నతో చూపును గదిలోకి మరల్చి '' ఎట్లా ఉంటాడో? నాకూ బాగా తెలవదు, అయితే కొద్దిగా తెలుసు. నిన్ననే వాటి ' ఐడెంటీపై' నోటీసు వచ్చిందన్నారు'' అంటూ తన జేబులోంచి ఓ కాగితాన్ని బైటికిలాగి, లాంతర్ దగ్గరగా బల్లమీద పరచాడు. దానిమీద తలవైపున నైజం మొహరు వేసి వుంది. దాన్ని రహిమాన్ ఇట్లా చదవసాగాడు.

పేరు : గోవిందు గ్రామం నల్గొండజిల్లాలో ఒక గ్రామం : సామాన్యరైతు. వయసు 22సం॥లు. ఎర్రగా 6 అడుగుల యెత్తు వుంటాడు. ఎడం వైపుగా, గడ్డం మీద ఇటీవలనే తగిలిన తుపాకీ గాయం

ఉంటుంది. మీసాలు కొసలు తిరిగి వుంటాయి. ఉంగరాలక్రాపు. కోలముఖం ఇతని మూలంగా, హిజ్ఎక్జాల్టెడ్ హైనెస్ సైన్యానికి చాలాసార్లు గొప్ప నష్టాలు కలిగినాయి అని తెలుస్తున్నది. ఇతను కాఫిర్‌ల పరమైన మన రాజ్యంలోని గెరిల్లా దొంగలగుంపు నాయకుడు. ఇతన్ని పట్టుకున్న వారికి ఐదువేల హాలీలు బహుమతి ఇవ్వడమేకాకుండా, దొరతనంలో పెద్ద ఉద్యోగంకూడా యివ్వబడుతుంది.''

చదవటం పూర్తిచేసి రహమాన్ తన సహచరుల ముఖాలవైపు చూసాడు. వాళ్ళందరికీ, గోవిందు విగ్రహం కళ్ళక్కట్టినట్టు కన్పిస్తున్నది. అబ్దుల్‌ఈ పరిస్థితి నుంచి ఐదునిముషాలకి తేరుకుని బల్లమీదకి ఆవేశంతో వంగి, ''వాణ్ణినేను గుర్తుపట్టగలను, ఐదు వేల హాలీలు! పెద్ద ఉద్యోగం బాబూ! మనం ఆ పైసానీ పంచుకుందాం!'' అని ఆనందంగా అరిచాడు.

అతని అరుపు గోడలకి వేళ్ళాడే తుపాకీలకితగిలి ప్రతిధ్వనించింది. ఆశబ్దం గదినుండి నిర్గమించకముందే, చప్పునలేచి నుంచున్నారు. నిమిషం గడిచి తర్వాత, టక టక బూట్లు చప్పుడుచేసుకుంటా ఒక నూతన వ్యక్తి మిలటరీ యూనిఫారంలో వున్నవాడు లోపలికి వచ్చాడు. అతని వెనక ఇంకో హిందూ సేవకుడూ డ్రైవరూ వొచ్చారు.

రహమాన్ సర్దార్‌వైపు వొంగి ''సలాంజీ, సర్దార్''! అన్నాడు. మిగతా అందరూ ''సలాం'' అన్నారు. సర్దార్ గదిలోకి ఒకసారి కలియజూసి, వాళ్ళ సలాము లందుకొని మళ్ళీ సలాం! అన్నాడు.

సర్దార్‌తో ఇంకెవ్వరూ రాకపోవడం రహమాన్‌కి తగని ఆశ్చర్యం కలుగజేసింది. దాదాపు ఏభైవంది రజ్వీ అనుచరులన్నా రావల్సిందని అతని అంచనా. సర్దార్ని కూర్చోమనాలన్న తలంపు అతన్ని ఆశ్చర్యం నుంచి మేల్కొల్పింది. ''సర్దార్‌జీ! ఇక్కడ కూర్చోండి!'' అన్నాడుతను మర్యాదగా తన కుర్చీ చూపుతూ....

సర్దార్, బల్లముందు కుర్చీలో కూర్చుంటూ, తన చేతిలోని రివాల్వర్ సంచి బల్లమీద పడేసి ముంజేతిమీద చొక్కా కప్పు వెనక్కిలాగి టైంచూసుకున్నాడు. 7.30 గంటలవుతున్నది. సర్దార్ మొహంమీద ఆదుర్దా కనిపించింది. అతను రహమాన్‌వైపు తీక్షణంగాచూసి '' ఇక్కడ ఎంత మంది వున్నారు? అని అడిగాడు ఆజ్ఞాపూర్వకంగా. రహమాన్ నమ్రతగా ''ఇరవై మంది ఉన్నాం'' అని ఒక నిముషం ఆగి, ''అయితే సర్దార్‌జీ, మీతో ఎవరూ, రాలేదే?'' అని అన్నాడు.

సర్దార్‌గంభీరాకృతిలో ఇంకా గంభీరం వచ్చింది. 'వీళ్ళుచాలు ... టైం అవుతోంది. మనం ఈపూటే గోవిందుని పట్టెయ్యాలి. జరూర్ హుకుం వచ్చింది. వాడు దగ్గిరలో నారాయ్‌పాలెంలోనే వున్నట్టు'' అన్నాడు.

ఈ జవాబు రహమాన్‌కి సబబుగా తోచకపోయినా, గతిలేక వొప్పుకున్నట్టు చిరునవ్వు నవ్వాడు. నవ్వాగిన తర్వాత అతను అబ్దుల్‌వైపు తిరిగి ''భాయీ? మిగతావాళ్ళు ఆగెడ్డ దగ్గర వుంటారేమో, పిల్చుకురా!'' అని అజ్ఞాపించాడు.

అబ్దుల్ వెంటనే గదినుండి నిష్క్రమించాడు. అబ్దుల్ వెళ్ళగానే రహమాన్ మిగిలిన వాళ్ళవైపు తిరిగి, ''లేవండి, తుపాకులూ, బ్రెన్‌గన్స్ రెడీ చేసుకోండి. అన్నీ లారీలోవేసి అందరూ లారీలోనే

ఎక్కండి'' అన్నాడు. మిగతా వాళ్ళందరూ, వెంటనే గబగబాలేచి తమ పనులలో నిమగ్నమైనారు.

సర్దార్‌జీ తన నిడుపాటిగడ్డాన్ని నిలువుగా కుడిచేత్తో దూస్తూ, రహమాన్‌వైపు తిరిగి ఇలా అన్నాడు. ''మీరు చాలా చురుగ్గా పనిచేయాలి!'' రహమాన్ ఆమోద సూచకంగా తలవొంచి తనూ తన తుపాకీ సర్దుకో ప్రారంభించాడు.

ఎనిమిదింటికి పది నిమిషాలుండగా, రజాకార్ల లారీ, నారాయ్ పాలెంవైపు బయల్దేరింది. ముందు ఇరవై మందిని మోసుకుని లారీ, దాని వెనక జీప్ కారులో సర్దార్, రహమాన్‌తో వచ్చిన సేవకుడూ, ప్రయాణం చేస్తున్నారు. రోడ్డు ఎన్నో ఏండ్లనుండి రిపేరు లేకపోవడం వల్ల చాలా గతుకులుగా వుంది. నక్షత్రాల కాంతి తప్ప ఇంకెల్లాంటి వెల్తురూలేదు. కార్ల తాలుకు దీపాలు సర్దార్‌వెలిగించవద్దని ఆజ్ఞాపించి వుండటంవల్ల అవీలేవు. గాడాంధకారం సంయిమంటోంది. జీప్ ముందుసీట్‌లో కూర్చుని వున్న రహమాన్ రోడ్డువంక నిరాశగాచూస్తూ సర్దార్‌ని ఉద్దేశించి ఇలా అన్నాడు ''సర్దార్‌జీ! వాడి కోసం ఇంత పట్టుదల ఏమిటి? హుకుంలో చాలా గందరగోళంగా వ్రాసివుంది. నిజంగా అంత అపాయకరమైన మనిషా వాడు...''

సర్దార్‌జీ, సిగిరెట్ వెలిగించుతూ, రహమాన్ చెప్పింది అలక్ష్యంగా అలకించి, ''వాడు... అంటే? ... ఓ! గోవిందు సంగతా, నువ్వడిగింది? వాడొక అపాయకరమైన మనిషే: సందేహం లేకుండా వాడొక బందిపోటు దొంగ!... వాడు ఇప్పటివరకూ, కనీసం వందమంది మన 'భాయీ' ల్ని చంపివుంటాడు'' అని సిగరెట్ తాగడంలో నిమగ్నమైనాడు.

రహమాన్ కారు కుదుపులకి తూలుతూ, '' ఇన్నాళ్ళ బట్టీ వాణ్ణెందుకు పట్టుకోలేక పోయినారో మనవాళ్ళు? ఆ కాఫిర్ వెధవే నా చేతుల్లోపడితే వాడిక పోయేది అల్లా దగ్గరకే!'' అన్నాడు ఖరారుగా.

సర్దార్‌జీ కళ్ళు ఆకారు చీకట్లో నక్షత్రాల కాంతికి తళ తళ మెరిశాయి. అతను చేతిలో సిగరెట్టు అసహ్యంగానూ, కసితోనూ రోడ్డుమీదికి విసిరికొట్టి ''వాడంత తేలికగా దొరకడనుకుంటాను - కానీ దొరికితేనా?'' అన్నాడు.

రహమాన్ వెంటనే సంభాషణ అందుకొని ''వీడెంత! నా చేతిలో మహా మహా వాళ్లు ఐపోయినారు'' అన్నాడు తనలోంచి తలనూపుతున్న భయాన్ని వెనకటి తన క్రౌర్యంలో దాచిపెట్టి.

సర్దార్ నవ్వాడు. రహమాన్‌కూడా నవ్వాడు పెద్దగా, డ్రైవరుకూడా నవ్వాలని ప్రయత్నించాడు గానీ, ఆకస్మాత్తుగా అతని చెయ్యి బ్రేక్‌మీద పడ్డది. కారు కీచుమని ఆగిపోయింది. ఈ శబ్దంతోపాటే రహమాన్ వెనక్కి తూలాడు సర్దార్ అప్రయత్నంగా రోడ్డుమీదికి చూసేడు. ముందుపోతున్న లారీ కన్పించలేదు. ఎక్కణ్ణుంచో మనుషులు అవసానదశలో మూలుగుతున్న ధ్వని మాత్రం గాఢంగానూ, విషాదంగానూ వినిపించసాగింది.

రహమాన్ చప్పున కారులోంచి దూకాడు. వాడి వెనకాలే సర్దారూ, అతని బంటూ, డ్రైవరూ దిగారు, కంగారుగా! జీపు కారుముందు లైట్ వెలిగింది. ఆ వెలుగులో రోడ్డుమీద, గెరిల్లాలు తవ్విన

గొయ్యిలో రజాకార్ల లారీ తలకిందులుగా పడిపోయిందని వాళ్ళూహించుకున్నారు. ఈ సంగతి తెలిసిన ఐదునిమిషాలకల్లా, వాళ్ళేదో చెయ్యాలనే ఆలోచనలో వుండగానే; నలుగురినీ గెరిల్లా సైనికులు వందమంది, సాయుధులు - చుట్టుకున్నారు వాళ్ళెవరూ తొందరపడలేదు. వాళ్ళలో ముఖ్యుడూ వున్నాడు. బాగా కండలు తిరిగిన శరీరంపై పట్టి బనీనూ, తువ్వాలూ వేసుకున్నాడు. చేతిలో రివాల్వర్ పుచ్చుకొని, రహమాన్ దగ్గరికి వచ్చాడు, రహమాన్‌కి అప్పటికి అర్థమైంది అక్కడ ఏం జరుగుతున్నదో, అతను తన పరిస్థితిని అర్థం చేసుకొని ఏ నిశ్చయానికి రాకముందే, అతన్ని గెరిల్లా వీరుడు లాక్కుపోయి రోడ్డు ప్రక్కన చెట్టుకి కట్టేశాడు.

డ్రైవరూ, సర్దార్‌తో వచ్చిన సేవకుడూ, గెరిల్లాల వైపు చూస్తూ నిలుచున్నారు.

సర్దారు మాత్రం ఏమీ ఆశ్చర్యపడకుండా ఇట్లాంటిదేదో జరుగుతుందని నమ్మినవాడల్లే రహమాన్‌వైపు చూస్తున్నాడు. గెరిల్లా వీరుడు సర్దార్ చెయ్యి గట్టిగా పుచ్చుకుని రహమాన్ దగ్గరికి తీసుకెళ్ళాడు.

కాగడాల వెలుగులో, రహమాన్ పిచ్చివాడిలా, సర్దార్ వెపు చూసాడు. సర్దార్‌కింకా తనగతి పట్టలేదేమో అన్నట్టుంది: అతని చూపు.

సర్దార్‌జీ రహమాన్‌వైపు హేళనగాచూసి, ''రహమాన్: నిన్నేమీ చెయ్యం. నీ క్రార్యాలకి నీకు ఈ రోజున శిక్షలేదు ఎందుకనుంటావా? నువ్వెళ్ళి నిజాంకి తెలియ జెయ్యాలి, గోవిందంటేఎట్లాంటివాడో: గోవిందు రజాకార్లకి రజాకార్, నైజాంకినైజాం: అని మీ రాజుని హెచ్చరించాలి నువ్వు. నీ కొత్త సర్దార్ ఆ గొయ్యిలో, అల్లాని చేరబోతున్నాడు. కావాలంటేవెళ్ళి పరామర్శించు?'' అంటూ తన పొడుగాటి దాంగడ్డాన్ని ఊడదీసి రోడ్డుమీద పారేసాడు.

రహమాన్ ఆశ్చర్యంతో కొయ్యబారిపోయినాడు. తన ఎదుటవున్నది ఎవరు? గెరిల్లా గోవిందు.

(ఆగస్ట్ 1948 విశాలాంధ్ర (మాసపత్రిక) నుండి)